క్లుప్తంగా

కనులపండువగా కల్యాణ మహోత్సవం



గురజాల : లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల కల్యాణ మహోత్సవం కనుల పండువగా శుక్రవారం నిర్వహించారు. స్థానిక పల్లెగుంత రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వారి దేవాలయంలో వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. అర్చకులు పవన్ కుమార్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణలతో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల, అంగన్ వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ శనివారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పిడుగురాళ్ల సీడీపీవో శ్రీవల్లి శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ వద్ద ఉన్న విద్యా అర్హత పత్రాలు, స్థానికంగా నివసిస్తున్న ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని పిడుగురాళ్ల పట్టణ విద్యుత్ శాఖ ఏఈ ఆరికట్ల శివారెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని మహావీర్‌నగర్ సమీపంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు జరుగుతున్న కారణంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి గుంటూరు బస్ షెల్టర్ వరకు, మెయిన్ రోడ్డుకు తూర్పు వైపు, సున్నం బట్టీల ప్రాంతం, లెలిన్ నగర్, ఇందిరమ్మ కాలనీ, టిడ్కో ఇండ్ల ప్రాంతం, అలాగే వ్యవసాయ విద్యుత్ సరఫరా కూడా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. విద్యుత్ వినియోగదారులు అంతరాయాన్ని గమనించి అసౌకర్యానికి సహకరించాల్సిందిగా ఏఈ కోరారు.

చెట్టినాడ్ సిమెంట్స్‌లో రక్తదాన శిబిరం



దాచేపల్లి : మండలంలోని పెదగార్లపాడు చెట్టినాడ్ సిమెంట్స్ ఫ్యాక్టరీలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీరాములు ఈ శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. పరిశ్రమలో పని చేస్తున్న 60 మంది కార్మికులు రక్తదానం చేశారు. రోడ్డు ప్రమాదాలతో పాటు అనారోగ్యాల బారినపడిన బాధితులకు సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని, రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణ దానం చేసినవాళ్లం అవుతామని శ్రీరాములు అన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలి

రైతు, కార్మిక సంఘాల నాయకుల డిమాండ్

పిడుగురాళ్ల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఢిల్లీలో గత 13 నెలలుగా రైతులు పోరాటాలు చేస్తుంటే వారిపట్ల కఠినంగా వ్యవహరించటం దుర్మార్గం అన్నారు. రైతులు పండించిన పంటలకు రెట్టింపు ఆదాయం వచ్చేల చేయకుండా, ఉన్న చట్టాలను రద్దు చేసిందన్నారు. రైతులపై కేంద్ర ప్రభుత్వం భాష్పవాయువులు, రబ్బరు బుల్లెట్లు, డ్రోన్లు ఉపయోగించి కాల్పులు జరపడం అత్యంత దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాస రావు, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, ఏఐఎఫ్‌టీయూ నాయకులు నీలాద్రి రాంబాబు, రైతు సంఘం మండల కార్యదర్శి బుంగా నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, సంపతి వెంకట కృష్ణ, చల్లగుండ్ల వెంకటేశ్వర్లు, గడ్డం కోటేశ్వరరావు, గుండ్ల వెంకటప్పయ్య, కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.

లైమ్‌సిటీలో ట్రాఫిక్ సమస్యకు చెక్



నిర్మాణం పూర్తయిన బైపాస్ రోడ్డు

- ఏళ్ల నాటి సమస్యకు మోక్షం
- నిర్మాణం పూర్తి కావచ్చిన బైపాస్ రైల్వే బ్రిడ్జి త్వరలో ప్రారంభం



బైపాస్ రైల్వే బ్రిడ్జిపై పూర్తి అయిన శ్లాబ్ నిర్మాణం



రైల్వే బ్రిడ్జిపై గడ్డర్లను ఏర్పాటు చేస్తున్న కార్మికులు



రైల్వే బ్రిడ్జి శ్లాబ్‌ను క్యూరింగ్ చేస్తున్న కార్మికులు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణానికి శాపంగా మారిన ట్రాఫిక్ సమస్యకు మోక్షం కలిగింది. ఏళ్ల తరబడి నిర్మాణంలో ఉన్న బైపాస్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావచ్చింది. ఈ బ్రిడ్జి త్వరలోనే ప్రారంభానికి సిద్ధమవుతుంది. గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పిడుగురాళ్ల పట్టణానికి ప్రధాన సమస్యగా మారిన ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం శక్తి వంచన లేకుండా కృషి చేసి నేడు పెండింగ్‌లో ఉన్న బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను శరవేగంగా చేయిస్తున్నారు.

టీడీపీ హయాంలో నిర్లక్ష్యం..

టీడీపీ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న 7 కిలోమీటర్ల బైపాస్ రోడ్డు నిర్మించలేకపోయారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అద్దంకి–నార్కెట్‌పల్లి హైవే నిర్మాణం 219 కిలోమీటర్లు పూర్తి చేస్తే, పిడుగురాళ్లలో 7 కిలోమీటర్ల బైపాస్ నిర్మాణం టీడీపీ ప్రభుత్వం చేయలేకపోయింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే లైమ్‌సిటీ పిడుగురాళ్ల పట్టణానికి 7 కిలోమీటర్ల బైపాస్ రోడ్డు నిర్మాణంతోపాటు బైపాస్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భావించి ప్రణాళిక ప్రకారం నిర్మాణం చేపట్టారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రణాళిక ప్రకారం బైపాస్ భూ బాధితులకు నష్టపరిహారం అందించి కోర్టు వివాదాలను పరిష్కరించి 7 కిలోమీటర్ల బైపాస్ నిర్మాణాన్ని పూర్తి చేయించారు. మిగిలిన బైపాస్ రోడ్డు బ్రిడ్జి పనులను ఎక్కడా రాజీ లేకుండా రాత్రి, పగలు పనులు చేయించారు. ఈ క్రమంలో బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి కావచ్చింది. బ్రిడ్జిపై గడ్డర్లను ఏర్పాటు చేసి వాటిపై శ్లాబ్ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. ప్రస్తుతం వాటర్ క్యూరింగ్ దశలో ఉంది. ఈ లోగ చిన్న చిన్న మైనర్ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. మొత్తం మీద కొన్ని రోజుల్లోనే ఈ బ్రిడ్జి ప్రారంభానికి సిద్ధమవుతుంది.

ట్రాఫిక్ సమస్య ఉండదు..



మా పట్టణంలో ప్రధాన సమస్య ట్రాఫిక్. ఆ సమస్యకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డ్ ప్రత్యేక కృషితో నిర్మాణ పనులు పూర్తి అయ్యే దశకు చేరుకున్నాయి. మా లైమ్‌సిటీకి ట్రాఫిక్ సమస్య తీరితే ప్రమాదాలు జరగవు. పొల్యూషన్ సమస్య నుంచి కూడా ప్రజలు బయట పడతారు.

కొమెర వెంకటేశ్వర్లు,
మార్కెట్ యార్డు చైర్మన్, పిడుగురాళ్ల

ప్రజల సమస్యకు పరిష్కారం..



ప్రజల సమస్యలను పరిష్కరించటంతోనే అభివృద్ధి జరుగుతుంది. అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రజల సమస్యను తనదిగా భావించి పిడుగురాళ్ల బైపాస్, రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించారు.

షేక్ బచ్చేమేస్త్రీ,
వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ పట్టణ కన్వీనర్, పిడుగురాళ్ల

జమ్మలమడక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు



జమ్మలమడకలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మాచర్ల రూరల్: మండలంలోని జమ్మలమడక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించారు. వైద్యులు మహతి, శ్రవణ్, సుధీర్‌ల నేతృత్వంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే కంటి పరీక్షలు నిర్వహించారు. గుండె జబ్బులున్న వారికి ఈసీజీ పరీక్షలు చేసి న్యూరాలజీ, ఆర్థో సంబంధిత సమస్యలున్న వారిని గుంటూరు జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. గ్రామంలో పెద్ద ఎత్తున పరీక్షలు నిర్వహించిన వైద్యులు, సిబ్బందిని సర్పంచ్ ముక్కా గురవయ్య శాలువాలతో, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎం.సుజాత, హెల్త్ సూపర్‌వైజర్ వీవీ రావు, హెల్త్ అసిస్టెంట్ బి.మురళీధర్, సుబ్బారెడ్డి, ఎంఎల్‌పీ స్వరూపారాణి, బాలసుశ్మిత, ఆదిలక్ష్మి, బత్తుల సిద్దయ్య తదితరులున్నారు.

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

దాచేపల్లి : విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని వినాయక ఇండ్రస్ట్రీస్ అధినేత, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలు రాస్తున్న 210 మంది విద్యార్థులకు వినాయక ఇండ్రస్ట్రీస్ ఆధ్వర్యంలో ఉచితంగా ప్యాడ్లు, పెన్నులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ..నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని చర్యలు తీసుకున్నారని, వేల కోట్లు ఖర్చు చేసి పాఠశాలలను ఆధునీకరించారని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు అంజిరెడ్డి, గురవారెడ్డి, జయకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ తల్లి గ్రామోత్సవం

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ, వెంకటాయపాలెం గ్రామాల్లో శుక్రవారం శ్రీ లక్ష్మీతిరుపతమ్మ గ్రామోత్సవ భక్తులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మాలధారణ చేపట్టిన దీక్షా స్వాములు సోమవారం పెనుగంచిప్రోలుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఇరుముడులు కట్టుకునేందుకు వారి ఇళ్ల నుంచి ఊరేగింపుగా బయలుదేరారు. మేళాతాళాలతో కుంకుమ బండ్లను, ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి ఊరేగింపు నిర్వహించారు. అదే విధంగా గ్రామంలోని వెంకటాయపాలెం సుగాలీ కాలనీకి చెందిన స్వాములు కూడా అమ్మవారిని ఊరేగించారు. భక్తులకు అన్న సంతర్పణచేశారు. ఇరుముడులు కట్టుకుని అమ్మవారి దర్శనానికి బయలుదేరి వెళ్లారు.

నేడు కోలగుట్లలో సచివాలయం ప్రారంభం

దుర్గి: మండలంలోని కోలగుట్ల గ్రామంలో శనివారం నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

నేడు సీహెచ్‌సీ, సచివాలయం ప్రారంభం

విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లో రూ.5.32 కోట్లతో నిర్మించిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం–1, రూ.17.5 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు మాచర్ల ఎంపీపీ బూడిద మంగమ్మ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొననున్నట్లు ఆమె చెప్పారు.

వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం సైనికుల్లా పనిచేయాలి

బీసీ అభ్యర్థి అనిల్‌కే ముదిరాజుల మద్దతు



మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయ కర్త అనిల్‌ను కలిసిన ముదిరాజ్ సంఘీయులు

మాచర్ల: బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తూ రాజకీయంగా, సామాజిక పరంగా వారి అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారని, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్‌కు ముదిరాజులంతా అండగా ఉంటారని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్న నారాయణ ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌ను నరసరావుపేటలో మాచర్ల ముదిరాజ్ సంఘ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పిస్తూ వారి ఉన్నతికి కృషి చేస్తున్న జగనన్న ప్రభుత్వానికి బీసీలంతా అండగా ఉండి తిరిగి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామన్నారు. పార్లమెంట్ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ఒక బీసీకి చెందిన అభ్యర్థిని ఎంపిక చేసి బీసీలు ఎందులో తక్కువ కాదని జగనన్న ఆలోచన చేశారన్నారు. వర్గాలు, కులాలు పక్కనపెట్టి ఐక్యతతో ముదిరాజులంతా అనిల్‌ను గెలిపించుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ బీసీల ఆత్మగౌరవాన్ని చాటేందుకు మనమంతా ఒక్కటై జగనన్నకు అండగా నిలుస్తున్నందుకు ముదిరాజ్ సంఘ నాయకులకు అభినందనలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ వీఎస్ స్వామి, రాష్ట్ర ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి వల్లెబోయిన రాజు, రాష్ట్ర కోశాధికారి బాలబోయిన పాపారావు, రాష్ట్ర యూత్ అధ్యక్షులు కోలా కొండలు, మాజీ కౌన్సిలర్ తాళ్ళ కొండలు, ముదిరాజ్ సంఘ నాయకులు రెబ్బలపల్లి సాయి మార్కొండయ్య, బొడ్డు నరసింహారావు, కాశిబోయిన ఆంజనేయులు, శాంతారావు, లక్కా కృష్ణారావు, కంటు వెంకట్రామయ్య, గోపి, సురేష్, కంటు వెంకటేశ్వర్లు, కృష్ణంరాజు, శ్రీను తదితరులున్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రత్నకుమారి



తుమ్మకోట జెడ్పీహెచ్‌ఎస్‌లో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

గురజాల : బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వై.రత్నకుమారి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనంలో వివాహాలు చేయడం వలన పలు ఇబ్బందులకు దారి తీస్తుందన్నారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలు నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

రెంటచింతల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.శ్రీదేవి అన్నారు. శుక్రవారం మాచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని రెంటచింతల–1 సెక్టర్ పరిధిలోని తుమ్మకోట జెడ్పీ హైస్కూల్‌లో, మంచికల్లు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలలో విద్యార్థినులకు బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ తదితర అంశాలపై వివరించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండని అమ్మాయికి, 21 సంవత్సరాలు నిండని అబ్బాయికి వివాహం చేయకూడదన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికల అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో బాలికలు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికలకు, మహిళలకు రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తుందన్నారు. బాలురతో పాటు సమానంగా బాలికలను కూడా తల్లిదండ్రులు చదివించాలన్నారు. మీ పట్ల ఎవరైన అసభ్యకరంగా ప్రవర్తించిన, వెంటబడి వేధిస్తున్నా వెంటనే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరారు. మీరు ఏ చిన్న పొరపాటు చేసిన సమస్య పెద్దది అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

ఘనంగా లలితాంబ చండీహోమం



సత్యసాయి బాబా దేవాలయ ప్రాంగణంలో లలితాంబ చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

మాచర్ల: పట్టణంలోని పత్తి ఫ్యాక్టరీ ఆవరణలో వేంచేసియున్న సత్యసాయి బాబా దేవాలయ ప్రాంగణంలో లలితాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సహస్రనామ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు కొత్తమాసు వీరాంజనేయులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చండీ హోమం నిర్వహించారు. అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో చండీ హోమం చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. నేడు (శనివారం) అమ్మవారి ఉత్సవాలలో భాగంగా కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సంత్ గాడ్గే బాబాకు ఘన నివాళి

సత్తెనపల్లి: స్వచ్ఛ భారత్ పితామహుడు సంత్ గాడ్గే బాబా 149వ జయంతి బీసీ సంఘ నాయకుడు పిల్లికతుపుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్ సెంటరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురువు, సంత్ గాడ్గే బాబా చరిత్రలో పరిశుభ్రతే దైవమని భావించిన తొలి సంఘ సంస్కర్త అని కొనియాడారు. చీపురుతో వీధులను, కీర్తనలతో మస్తిష్కాలను శుభ్రం చేసిన వాగ్గేయకారుడు సంత్ గాడ్గే బాబా అని కొనియాడారు. ప్రకృతిని కాపాడుకోవాలని చెప్పిన పర్యావరణ వాది, తన మొత్తం జీవితాన్ని సమాజానికి అర్పించిన సర్వసంగ పరిత్యాగి సంత్ గాడ్గే బాబా అని పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్ర నేటి, రేపటి యువతరానికి స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు తుళ్ళూరి శివరామకృష్ణ, గుంటూరు గోవిందు, కుమ్మరి దస్తగిరి, చింతా అంకమ్మరావు, పుల హరి బానోజీ, చావల వెంకటేశ్వర్లు, షేక్ చిన్న షరీఫ్ పాల్గొన్నారు.

పల్నాడు మణిహారం.. ఆధునిక దేవాలయం

నాడు.. ఇప్పటివరకు పల్నాడు ప్రాంతం గురజాల నియోజవర్గంలో కేవలం 30 పడకల ఆసుపత్రి మాత్రమే ఉంది. ఏ ప్రమాదం జరిగినా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, నరసరావుపేట లాంటి ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వచ్చేది. సరైన సమయంలో వైద్యం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. ఎన్నికల్లో గెలిచిన ప్రజా ప్రతినిధులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉన్నత హాస్పిటల్ నిర్మించాలని ప్రజలు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. వైద్యం అందక ప్రజలు నానా అవస్థలు, ఇబ్బందులకు గురయ్యేవారు.

నేడు.. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి అసెంబ్లీ సమావేశంలో పల్నాటి ప్రాంతంలో వైద్యం అందక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఓ వైద్య, మెడికల్ కాలేజి అవసరం ఉందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం వెంటనే స్పందించి మొదటి బడ్జెట్ సమావేశంలోనే మెడికల్ కాలేజి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.360 కోట్లు, మరో రూ.150 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేయించడం జరిగింది. 2021లో మెడికల్ కాలేజి, హాస్పిటల్‌కు శంకుస్థాపన చేసారు. పనులు త్వరితగతిన జరుగుతున్నాయి. ఈ నెల 26న మొదటి దశగా 100 పడకల హాస్పిటల్ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదగా ప్రారంభం కానుంది. 2024 సెప్టెంబర్ నాటికి మరో 500 పడకల హాస్పిటల్ అందుబాటులోకి రానుంది. దీని ద్వారా పల్నాడు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

- రూ.500 కోట్లతో మెడికల్ కాలేజి, 600 పడకల హాస్పిటల్
- పూర్తయిన మొదటి దశ పనులు
- ఈ నెల 26న ప్రారంభానికి సిద్ధం



ప్రారంభానికి సిద్ధం అయిన భవన సముదాయాలు

పిడుగురాళ్ల రూరల్: పల్నాడు ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు మరో ఆధునిక దేవాలయం నిర్మితమై మొదటి దశ పూర్తి చేసుకొని ఈనెల 26న ప్రారంభించేందుకు సర్వం సిద్ధం అయింది. పల్నాటి ప్రాంత ప్రజలకు మెరుగైన, కార్పొరేట్ స్థాయి సత్వర వైద్య సేవలు అందివాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషితో సుమారు రూ.500 కోట్లతో డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కాలేజి, 600 పడకల హాస్పిటల్ నిర్మాణ పనులు వేగవంతగా చేపట్టడం జరిగింది.

పల్నాటి నడిబొడ్డున..

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కామేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో సుమారు 55 ఎకరాల విస్తీర్ణంలో 12 లక్షల చదరపు అడుగుల్లో 600 పడకల హాస్పిటల్, వైద్య విద్యకు కాలేజి, ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్లు, నర్సింగ్ కాలేజి, స్టాఫ్ నివాస భవనాలు, హాస్టల్, తదితర భవన సముదాయాలతో రూపుదిద్దుకోబోతుంది. 2025 జూన్ నాటికి వైద్య విద్యకు అడ్మిషన్లు అందుబాటులోకి రానున్నాయి. సుమారు 500 వైద్య విద్యకు, 200 మంది నర్సింగ్ విద్యార్థులు విద్యనభ్యసించేందుకు సర్వం సిద్ధం అవుతుంది.

మా గ్రామానికి మంచి గుర్తింపు వచ్చింది..

మా గ్రామ సమీపంలో మెడికల్ కాలేజి నిర్మించడం వలన మా గ్రామానికి మంచి గుర్తింపు వచ్చింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషితోనే ఇది సాధ్యపడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

ముప్పూరి వెంకట రమణ, గ్రామ సర్పంచ్, కామేపల్లి

ఏళ్ల నాటి కల నెరవేరింది..

పల్నాటి ప్రాంత ప్రజల ఏళ్ల నాటి కల నేడు నెరవేరనుంది. పల్నాటి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం కాలినొప్పి నుంచి గుండె జబ్బు వరకు, క్యాన్సర్ లాంటి వ్యాధులకు సైతం వైద్యం అందబోతోంది. ఇది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషి ఫలితమే.

యర్రంరెడ్డి రామిరెడ్డి,
రిటైర్డ్ ఎంఈవో, బ్రాహ్మణపల్లి

కంది కొనుగోళ్లు ప్రారంభం

నకరికల్లు: రైతు భరోసా కేంద్రాల్లో కంది కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు జిల్లా రైతు శిక్షణా కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. కంది కొనుగోలు విధి విధానాలు వివరిస్తూ గుండ్లపల్లి గ్రామంలోని రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. క్వింటా కందికి రూ.9,755లు మద్దతు ధర కల్పించినట్లు తెలిపారు. ఈ–క్రాప్ నమోదు చేసుకుని, ఈ–కేవైసీ పూర్తిచేసుకున్న రైతుల నుంచే కంది పంట కొనుగోలు చేస్తామన్నారు. నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా కంది కొనుగోలు చేసి, వారం రోజుల్లోపు రైతు ఖాతాలో నగదు జమ చేస్తారని చెప్పారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, వీఏఏ ఎం.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

సత్తెనపల్లి: పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించారు. మండలంలోని వివిధ జెడ్పీ ఉన్నత పాఠశాలలు, గురుకుల విద్యాలయం, కస్తూర్బా గాంధీ పాఠశాలలో మొత్తం 1,396 మంది విద్యార్థులకు గాను 1,381 మంది పరీక్షలకు హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. తొలి రోజు ప్రశాంతంగా పరీక్షలు జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు.